క్లుప్తంగా

శ్రీలక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు



ప్రత్యేక పూజల్లో భక్తులు

కనిగిరి రూరల్: దేవాంగ నగర్‌లోని కేటీఆర్ టెక్నో స్కూల్ ఆవరణ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో బుధవారం ప్రత్యేక పూజలు జరిగాయి. స్వాతి నక్షత్రాన్ని పురస్కరించుకుని శ్రీలక్ష్మీ నరసింహస్వామికి పంచామృతాభిషేకాలు, విశిష్ట పూజ కార్యక్రమాలు ఎంతో నియమనిష్ఠలతో నిర్వహించారు. ప్రత్యేక పూజల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ కమిటీ నాయకులు శింగరాజు మాల కొండేశ్వరరావు, ఉప్పాల నరసింహ, రామిరెడ్డి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

జాబ్‌మేళాను వినియోగించుకోవాలి



మాట్లాడుతున్న ఎస్‌కే బాషా

కనిగిరి రూరల్: నిరుద్యోగ యువతీ, యువకులు జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ఎస్‌కే బాషా, జిల్లా ఉపాధి కార్యాలయం అధికారి డి.రమేష్‌బాబు అన్నారు. స్థానిక జీసీ అండ్ వైపీఎస్ డిగ్రీ కళాశాలలో బుధవారం మినీ జాబ్‌మేళా జరిగింది. జాబ్‌మేళాలో 6 కంపెనీల ప్రతినిధులు పాల్గొనగా 105 మంది నిరుద్యోగ యువతీ, యువకులు హాజరయ్యారు. 43 మంది వివిధ కంపెనీల్లో ఉద్యోగాలకు సెలక్ట్ అయినట్లు అధికారులు తెలిపారు. స్కిల్ హబ్ కో ఆర్డినేటర్ బెనర్జీ, జేసీఓ నర్మద, కళాశాల కరస్పాండెంట్, డైరెక్టర్లు ఏలూరి సుబ్బారావు, ఏలూరి నరేష్ చౌదరిలు పాల్గొన్నారు. ఉద్యోగాలకు ఎంపికైన వారిని అభినందించారు.

ముగ్గురు విద్యార్థినులకు స్కాలర్‌షిప్ అందజేత



స్కాలర్‌షిప్ అందజేస్తున్న ఏపీజీబీ మేనేజర్, హెచ్‌ఎం

పామూరు: ఆంధ్రా ప్రగతి గ్రామీణ బ్యాంకు ఆధ్వర్యంలో కార్పొరేట్ సోషల్ రెస్పాన్స్‌బిలిటీ కింద ముగ్గురు విద్యార్థినులకు ఒక్కొక్కరికి రు.5 వేలు వంతున స్కాలర్‌షిప్ అందజేశారు. ఈ సందర్భంగా బుధవారం స్థానిక ఏపీజీబీలో జరిగిన కార్యక్రమంలో స్కాలర్‌షిప్‌కు ఎంపికైన మండలంలోని మార్కొండాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన అత్యాల జ్యోత్స్నారాణి, ఎండ్లూరి సౌమ్య, పామూరు జీహెచ్‌ఎస్‌కు చెందిన పాలేటి జెస్సీలకు ఏపీజీబీ మేనేజర్ మురళీకృష్ణ స్కాలర్‌షిప్‌కు చెందిన బ్యాంకు ఖాతా పాస్‌పుస్తకాలను అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం చావా శ్రీనివాసులు, తల్లులు పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించాలి



రికార్డులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ సురేష్

పామూరు: సచివాలయ సిబ్బంది విధిగా సమయపాలన పాటించాలని మండల అభివృద్ధి అధికారి బొలినేని సురేష్ అన్నారు. మండలంలోని దాదిరెడ్డిపల్లె గ్రామ సచివాలయాన్ని బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు, హాజరు పట్టీని పరిశీలించారు. పెండింగ్ దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం గ్రామంలో రబీలో సాగు చేసిన పంటలకు సూపర్ చెక్‌లో భాగంగా క్షేత్ర స్థాయిలో పంటల సాగును తనిఖీ చేశారు.

ఆటోలు ఢీకొని ముగ్గురికి గాయాలు



గాయపడిన ప్రయాణికులు

టంగుటూరు: ప్రయాణికులను ఎక్కించుకునేందుకు ఆగి ఉన్న ఆటోను వెనుక నుంచి మరో ఆటో ఢీకొని ముగ్గురు ప్రయాణికులకు తీవ్రగాయాలైన సంఘటన టంగుటూరు మండలంలోని జమ్ములపాలెం సమీపంలో బుధవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. కొండపి వైపు నుంచి ఒక ఆటో టంగుటూరు వైపు వస్తూ జమ్ములపాలెం వద్ద ఆగి ప్రయాణికులను ఎక్కించుకుంటోంది. ఆ సమయంలో వెనుక నుంచి మరో ఆటో వచ్చి బలంగా ఢీకొని బోల్తాపడింది. ఆటోలో ఉన్న ఇద్దరు ప్రయాణికులకు తీవ్ర గాయాలు, ఒకరికి స్వల్ప గాయాలు అయ్యాయి. క్షతగాత్రులను ఓ ప్రైవేటు వాహనంలో ఆస్పత్రికి తరలించారు.

లక్ష కొట్టు..బెల్టుషాప్ పట్టు



రాత్రి పదిన్నర గంటలకు మద్యం అమ్ముతున్న షాప్ యాజమాన్యం



మద్యం షాప్ పక్కనే షాప్ లో సిట్టింగ్ వేస్తున్న మద్యం ప్రియులు

- బెల్ట్ షాపులకు మద్యం సరఫరా చేస్తున్న సిండికేట్లు
- పగలు, రేయి తేడా లేకుండా మద్యం అమ్మకాలు
- మద్యం దుకాణాల వద్ద సిట్టింగ్‌కు ఏర్పాట్లు
- బార్లను తలపిస్తున్న మద్యం దుకాణాలు

సాక్షి టాస్క్ ఫోర్స్:

లక్ష కొట్టు.. బెల్టుషాప్ పట్టు అన్న చందంగా తయారైంది కొండపి మండలంలోని బెల్ట్ షాపుల పరిస్థితి. మండలంలో ఏ గ్రామానికైనా బెల్ట్ షాప్ కావాలంటే మద్యం దుకాణాల వద్ద లక్ష రూపాయలు డిపాజిట్ కడితే వెంటనే బెల్టు షాపునకు అనుమతులు ఇస్తున్నారని ప్రజలు గుసగుసలాడుకుంటున్నారు. బెల్ట్ షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు చెబుతున్నా మద్యం దుకాణదారులు సిండికేట్ అయ్యి బెల్ట్ షాపులకు మద్యాన్ని తరలిస్తున్నారు. లక్ష రూపాయల డిపాజిట్ కడితే అధికారులు అటువైపు కన్నెత్తి చూడకుండా చూస్తామని బెల్ట్ షాపుదారులకు హామీ ఇస్తున్నారు.

సిండికేట్ గా మద్యం దుకాణాలు

మండలంలో ప్రభుత్వ ఆదేశాల ప్రకారం మూడు మద్యం దుకాణాలు మంజూరయ్యాయి. దుకాణదారులు ఎవరికి వారు మద్యం అమ్ముకోవాల్సి ఉండగా మూడింటినీ సిండికేట్ చేశారు. గత ప్రభుత్వంలో కొండపి, కె.ఉప్పలపాడు, పెట్లూరు గ్రామాల్లో మద్యం దుకాణాలు ఉండేవి. ఈ ప్రభుత్వం లో మద్యం షాప్ యజమానులు సిండికేట్ చేయడం ద్వారా అమ్మకాలను ఇష్టారాజ్యంగా చేస్తూ బెల్ట్ షాపులను ప్రోత్సహిస్తున్నారు.

పగలు రేయి తేడా లేకుండా

మద్యం అమ్మకాలు:
మద్యం దుకాణాలకు ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం ఉదయం 10 నుంచి సాయంత్రం 10 గంటల వరకు మాత్రమే అనుమతి ఉంటుంది. ఇక్కడ మాత్రం మద్యం అమ్మకాలు భిన్నంగా సాగుతున్నాయి. ఉదయం 7 నుంచి రాత్రి 11 గంటల వరకు అమ్మకాలు సాగుతూనే ఉన్నాయి. మధ్య రాత్రుల్లో దుకాణాలు మూసివేసినా వాటి పక్కనే తమ వారితో సీసాకి రూ.50 అదనంగా వసూలు చేస్తూ అమ్మకాలను యథేచ్ఛగా కొనసాగిస్తున్నారు. కొన్ని బెల్ట్ షాపుల్లో అయితే రూ.70 నుంచి రూ.100 వరకు అదనంగా వసూలు చేస్తున్నారు. రెస్టారెంట్లలో మద్యం అమ్మకాలకు అనుమతి లేకపోయినా, జోరుగా విక్రయిస్తున్నారు. క్వార్టర్ మద్యం ధర రూ.180 ఉండగా దానిని రూ.230 కి అమ్ముతున్నారు.

మద్యం దుకాణాల వద్ద సిట్టింగ్:

మద్యం ప్రియులకు దుకాణదారులు బంపర్ ఆఫర్ ఇస్తున్నారు. మద్యం దుకాణాల వద్ద తాగడానికి సిట్టింగ్ లను ఏర్పాటు చేస్తున్నారు. దుకాణాల వద్ద మద్యం తాగడానికి అనువుగా వాటర్ బాటిల్స్, కూల్‌డ్రింక్ బాటిల్స్, చికెన్ స్నాక్స్ వంటి షాపులను ఏర్పాటు చేసుకున్నారు. దీంతో మద్యం ప్రియులు అక్కడే సిట్టింగ్‌లు వేస్తున్నారు. మద్యం దుకాణాలు కాస్త బార్లను తలపిస్తున్నాయి. ఆ ప్రాంతాల్లో రాత్రి వేళలో ఆడవారిని ఎక్కించుకొని ప్రయాణం చేయడానికి వాహనదారులు భయపడుతున్నారు. కొందరు అక్కడే మద్యం తాగి వాహనాలను అమిత వేగంతో నడుపుతూ ప్రజలను భయాందోళనకు గురి చేస్తున్నారు. కొండపిలో మద్యం దుకాణం ఒకటి చర్చికి కూతవేటు దూరంలో, మరొకటి గురుకుల పాఠశాలకి సమీపంలో ఉంది.



మద్యం షాప్‌ను ఆనుకొని మద్యం తాగుతున్న మద్యం ప్రియులు



మద్యం షాపును తనిఖీ చేస్తున్న ఎక్సైజ్ సీఐ శివకుమారి (ఫైల్)

స్పందించని అధికారులు

ఇంత జరుగుతున్నా అధికారులు అటువైపు కన్నెత్తి కూడా చూడడం లేదు. నామ మాత్రపు తనిఖీలతో సరిపెడుతున్నారని ప్రజలు అంటున్నారు. రెస్టారెంట్లలో, బెల్ట్ షాపుల్లో, మద్యం అన్నివేళలా అందుబాటులో ఉంటున్నా అధికారులు వచ్చే సమయానికి ఆ ఆనవాళ్లు కూడా లేకుండా చేస్తున్నారని, ముందస్తు సమాచారం ఇచ్చి అధికారులు తనిఖీ చేస్తున్నారేమో అని ప్రజలు చర్చించుకుంటున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి బెల్ట్ షాపు నిర్వాహకులపై, రెస్టారెంట్ల పై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

పంటలపై మంచు ప్రభావం తీవ్రం



పామూరు: రైతులకు సాగులో మెళకువలు వివరిస్తున్న ఏడీఏ రమణ



పొందూరులో శనగ పంటను పరిశీలిస్తున్న డీపీఎం సుభాషిణి, ఏఓ స్వర్ణలత



పీసీపల్లి: రైతులతో మాట్లాడుతున్న ఏఓ ప్రకాష్‌రావు

పీసీపల్లి: మంచు సమయంలో పంటలపై రైతులు అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయాధికారి ప్రకాష్‌రావు అన్నారు. మండలంలోని వెంగలాయపల్లి, దివాకరపురంలో గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేషనల్ పెస్ట్ సర్విలియన్స్ సిస్టంపై అవగాహన కల్పించారు. ఈ అప్లికేషన్ ద్వారా రైతులు నేరుగా పొలాల్లోకి వెళ్లి పురుగు తెగులు ఫొటో తీయాలని చెప్పారు. దీంతో రైతులు పురుగులు తెగుళ్లను గుర్తించి వాటికి సంబంధించిన మందులు పిచికారీ చేయవచ్చని తెలిపారు. రైతులు కొత్త కొత్త పద్ధతులు అవలంబించి పురుగుమందులు తగ్గించి సాగు చేయాలని కోరారు. గ్రామసభ అనంతరం పొలాలను పరిశీలించి కందిలో పురుగు ఉధృతి ఉన్నందున తగు చర్యలు తీసుకోవాలని చెప్పారు. చీడపీడల గురించి అవగాహన కల్పించి నివారణ చర్యలు చేపట్టాలని కోరారు. ఏఈఓ పుల్లయ్య, రామిరెడ్డి పాల్గొన్నారు

కనిగిరి రూరల్: రైతులు పంట సస్యరక్షణ చర్యలు పాటించి అధిక దిగుబడులు, లాభాలను పొందాలని మండల వ్యవసాయాధికారి పి.జ్యోత్స్నాదేవి అన్నారు. మండలంలోని బొమ్మిరెడ్డిపల్లి, ఏరువారిపల్లి రైతు భరోసా కేంద్రాల్లోని గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా శనగ, మిరప, తదితర పంటలను వ్యవసాయాధికారులు పరిశీలించారు. అనంతరం జరిగిన అవగాహన కార్యక్రమంలో ఏవో, ఉద్యాన అధికారి అంజలీబాయి మాట్లాడుతూ మిరపలో నల్లితామర పురుగు, కాయతొలుచు పురుగు, కొమ్మ ఎండు తెగులు నివారణకు ప్రాపర్ గైట్ రెండు మిల్లీ మీటర్లు నీటిలో కలిపి పిచికారీ చేయాలని తెలిపారు. తామర పురుగుల నివారణకు ఎసిమాపిడ్ 0.2 గ్రాములు లేదా విప్రోనిల్ పిచికారీ చేయాలన్నారు. వ్యవసాయ అధికారులు రాజశేఖర్, ధనలక్ష్మి, కళ్యాణ్, ప్రసన్న, స్థానిక రైతు నాయకులు పాల్గొన్నారు.

సీఎస్‌పురం (పామూరు): రైతులు వరి నాటే సందర్భంలో కొసలు తుంచి నాటితే కాండం తొలిచే పురుగును సమర్థంగా నివారించవచ్చని ఏఓ బి.సంపత్‌కుమార్ అన్నారు. మండలంలోని దర్శిగుంట్ల, కొత్తపల్లె గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ వరి నాటడంలో అనుసరించాల్సిన పద్ధతులు వివరించారు. వరి సాగులో ఉత్తరం, దక్షిణం కాలిబాటలు తీయడం ద్వారా గాలి, వెలుతురు తగిలి పురుగులు, తెగుళ్ల ఉధృతి తగ్గి 10 నుంచి 15 శాతం అధిక దిగుబడులు వస్తాయని సూచించారు. ఈ సందర్భంగా వరి నారుమడులు, వరినాట్లు, జొన్న, మొక్కజొన్న, కంది పైర్లను పరిశీలించారు. రైతులు రసాయన ఎరువులతో పాటు జీవన ఎరువులు, సేంద్రియ ఎరువులు వాడాలని సూచించారు. ఈ సందర్భంగా వరి పైర్లను ఆశించే తెగుళ్లను వివరించి నివారణ పద్ధతులను రైతులకు సూచించారు. ఏఈఓ పావలి శ్రీనివాసులు, వీఏఏ వి.అనూష, రైతులు పాల్గొన్నారు.

పామూరు: తెగుళ్ల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని ఏడీఏ ఈవీ రమణ అన్నారు. మండలంలోని పడమటి కట్టకిందపల్లె, చిలంకూరు గ్రామాల్లో బుధవారం పొలంపి లుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కంది, వరి, శనగ పంటలను పరిశీలించి వాటిని ఆశించే తెగుళ్లు, లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. కార్యక్రమంలో ఏవో కంచం రాధ, వీఏఏ, రైతులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యం

టంగుటూరు: ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యం బాగుంటుందని ప్రకృతి వ్యవసాయ డీపీఎం సుభాషిణి అన్నారు. మండలంలోని ఎం.నిడమానూరు, పొందూరు గ్రామాల్లో వ్యవసాయ శాఖ, అనుబంధ శాఖలతో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీపీఎం సుభాషిణి ప్రకృతి వ్యవసాయం ఆవశ్యకతను వివరించారు. రసాయన ఎరువులు ఎక్కువగా వాడటం వలన భూమి నిస్సారంగా తయారవుతుందన్నారు. రైతులు రసాయన ఎరువులు, పురుగు మందుల వాడకం తగ్గించి ప్రకృతి వ్యవసాయ సిబ్బంది సహకారంతో కషాయాలు వాడుకోవాలని సూచించారు. అనంతరం శనగ, పొగాకు పంటలను పరిశీలించి తెగుళ్ల నివారణకు సలహాలు, సూచనలు చేశారు. కార్యక్రమంలో ఏఓ స్వర్ణలత, పీఈఓ వేణుమని, పాల్గొన్నారు.

వైద్య శిబిరాలు నిర్వహించి ప్రజలను ఆదుకోవాలి



కొండపి ఎస్సీకాలనీలో పర్యటిస్తున్న వ్యవసాయ కార్మిక సంఘ నాయకులు

కొండపి: వైద్య శిబిరాలు నిర్వహించి ప్రజలను ఆదుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు అన్నారు. దళితవాడల సర్వేలో భాగంగా గుర్రప్పడియ, నెన్నూరుపాడు, కొండపి, తదితర ప్రాంతాల్లో సర్వే నిర్వహించి కొండపిలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వాలు పంచాయతీలకు తగిన నిధులు కేటాయించకపోవడంతో పాటు ఉన్న కొద్దిపాటి నిధులతో కూడా కనీస పర్యవేక్షణ లేనందువలన గ్రామాలు, దళితవాడలు మురికి కూపాలుగా మారాయన్నారు. రోడ్లు లేకపోవడం, రోడ్లు వేసిన దగ్గర మురుగు కాలువలు నిర్మించకపోవడంతో మురుగు కేంద్రాలుగా కాలనీలు మారాయని విమర్శించారు. మురుగు తొలగించకపోవడంతో దోమలు పెరిగి ప్రజలను కుట్టడం వలన విషజ్వరాలు వ్యాపిస్తున్నాయన్నారు. అధికారులు వెంటనే స్పందించి పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. ప్రైవేట్ వైద్యశాలల్లో ట్రీట్మెంట్కి వేల రూపాయలు ఖర్చవుతుందన్నారు. వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, జిల్లా నాయకులు కేజీ మస్తాన్, మక్కెన కోటేశ్వరరావు, యేసుదాసు, మరియమ్మ, బాలయ్య, బ్రహ్మయ్య పాల్గొన్నారు.


రైతులంతా ఈకేవైసీ చేయించుకోవాలి



వరి పంటను పరిశీలిస్తున్న ఏవో విజయ్‌కుమార్

కొండపి: పంటల బీమాకు నగదు చెల్లించి నమోదు చేసుకున్న రైతులంతా తప్పనిసరిగా గ్రామ వ్యవసాయ సహాయకుల వద్ద ఈకేవైసీ పూర్తి చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి డి.విజయ్‌కుమార్ సూచించారు. బుధవారం మండలంలోని నెన్నూరుపాడు, గుర్రప్పడియ గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రబీ సీజన్లో వేసిన కంది పంట ప్రస్తుతం పూత దశలో ఉందని, పురుగు నివారణకు రైతులకు సూచనలు చేశారు. ముందుగా కంది, వరి పంటలను పరిశీలించారు. జ్యోత్స్న, వెంకటరావు ఉన్నారు.

సిద్ధమూర్తి వెంకట నారాయణరెడ్డికి నివాళి



సిద్ధమూర్తికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

పామూరు: వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు సిద్ధమూర్తి వెంకట నారాయణరెడ్డి (59) అజాత శత్రువని, ఆయన మృతి పార్టీకి తీరని లోటని వైఎస్సార్ సీపీ నాయకులు అంబటి కొండారెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ పువ్వాడి రాంబాబు అన్నారు. సిద్ధమూర్తి సంతాపసభ మండలంలోని ఇనిమెర్లలోని ఆయన స్వగృహంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి పలువురు ఘన నివాళులర్పించారు. పార్టీకి ఆయన చేసిన సేవలను కొనియాడారు. సీపీఐ జిల్లా కార్యదర్శి మన్నేపల్లి లక్ష్మీనారాయణ, సింగిల్ విండో మాజీ చైర్మన్‌లు బైరెడ్డి జయరామిరెడ్డి, బోయళ్ల నారాయణరెడ్డి, సర్పంచ్ సిద్ధమూర్తి లక్ష్మీనారాయణరెడ్డి, ఉప సర్పంచ్ బొమ్మన శ్రీనివాసులు, గట్లా విజయభాస్కర్‌రెడ్డి, సిద్ధమూర్తి లక్ష్మీరెడ్డి, మల్లికార్జునరెడ్డి, పలువురు టీడీపీ, సీపీఐ, సీపీఎం నాయకులు పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు



సిబ్బందితో మాట్లాడుతున్న డీఆర్డీఏ పీడీ రవికుమార్

కొండపి: విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించే వీఓఏలపై చర్యలు తీసుకుంటామని డీఆర్డీఏ వెలుగు ప్రాజెక్టు డైరెక్టర్ రవికుమార్ హెచ్చరించారు స్థానిక డీఆర్డీఏ వెలుగు కార్యాలయాన్ని బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం ఏపీఎం, సీసీఎస్, వీవోఏలతో సమీక్ష సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. శాఖ పరిధిలో మండలంలో జరుగుతున్న ప్రాజెక్టు కార్యక్రమాలు, ప్రోగ్రెస్‌పై సిబ్బందితో సమీక్ష చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. మండలంలో మహిళా మార్ట్ ఏర్పాటుకు తగిన చర్యలు తీసుకోవాలని సిబ్బందికి ఆదేశాలిచ్చారు. ప్రతి సభ్యురాలికి వాటాధనం కట్టించి వాటాదారులను చేయాలన్నారు. మార్ట్ ఏర్పాటుకు భవనాన్ని గుర్తించాలన్నారు. శాఖ ద్వారా ప్రభుత్వం చేపట్టి అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలు అందుకునే విధంగా స్వయం సహాయక సంఘాల సభ్యులను మరింత చైతన్యం చేయాలని సిబ్బందికి సూచించారు. గ్రూపుల వన్ బీ వర్క్స్ అయినా గ్రేడింగ్‌లు, పొదుపు పుస్తక నిర్వహణ సక్రమంగా ఉండాలని సిబ్బందికి సూచించారు. మహిళల జీవనోపాధికి అందిస్తున్న సామాజిక పెట్టుబడి రుణాలు, శ్రీనిధి రుణాలు, ఎస్సీ, ఎస్టీలకు ఇస్తున్న ఉన్నతి రుణాల విడుదల చేయడంలో చొరవ తీసుకోవాలని కోరారు. రికవరీలు సక్రమంగా చెల్లించని వారికి నోటీసులు జారీ చేయాలని సిబ్బందికి తెలిపారు. ఏసీ కత్తి కల్యాణ్, ఏపీఎం బల్లికూర గోపీనాథ్, సీసీలు మల్లికార్జున, కృష్ణారెడ్డి, రామాంజనేయులు, అకౌంటెంట్ కోటేశ్వరి, వీవోఏలు పాల్గొన్నారు.

పశువైద్య శిబిరాలతో పశుపోషకులకు మేలు



పైడిపాడులో పశువైద్య శిబిరంలో పశువులకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

జరుగుమల్లి (సింగరాయకొండ): మండలంలోని అన్ని గ్రామాల్లో ముందస్తు ప్రణాళికల ప్రకారం పశువైద్య శిబిరాలు నిర్వహిస్తామని, పశుపోషకులు సద్వినియోగం చేసుకోవాలని మండల పశువైద్యాధికారి జె.శ్రావణి విజ్ఞప్తి చేశారు. జరుగుమల్లి మండలంలోని పైడిపాడు, సతుకుపాడు రైతు సహాయక కేంద్రం వద్ద బుధవారం నిర్వహించిన పశువైద్య శిబిరంలో ఆమె పాల్గొని పశువులకు నట్టల నివారణ మందు తాగించారు. ఎదకు రాని, తిరగకట్టు పశువులను పరీక్షించి మందులిచ్చారు. మొత్తం 110 మంది పశుపోషకులకు సంబంధించిన పశువులకు ఉచితంగా మందులు అందజేసారు. పశువైద్య సిబ్బంది, పశుపోషకులు పాల్గొన్నారు. డాక్టర్ శ్రావణి మాట్లాడుతూ 40 శాతం రాయితీపై గడ్డి కత్తిరించు యంత్రాలు 2 హెచ్‌పీ, 3 హెచ్‌పీ గలవి ఉన్నాయని, ఒక్కొక్క యూనిట్ ధర 20,382 రూపాయలని వివరించారు. గురువారం నందనవనం గ్రామంలో పశువైద్య శిబిరం నిర్వహిస్తామని తెలిపారు.

చౌటపాలెంలో...

పొన్నలూరు: మండలంలోని చౌటపాలెం గ్రామంలో బుధవారం పశు వైద్య శిబిరం నిర్వహించారు. పశువైద్యాధికారి శివరామకృష్ణ గేదెలు, గొర్రెలు, మేకలకు సాధారణ వైద్య పరీక్షలు, గర్భ కోశ వ్యాధుల నిర్ధారణ, చూడి పరీక్షలు, గొంతు వాపు వ్యాధి నిరోధక టీకాలు, గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులు తాపించారు. అనంతరం శివరామకృష్ణ మాట్లాడుతూ ప్రతి గ్రామంలో ఉచిత పశు వైద్య శిబిరాల ద్వారా గేదెలు, గొర్రెలు, మేకలకు వైద్య సేవలు అందిస్తామన్నారు. అలాగే పశువులకు వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల పశుపోషకులు అప్రమత్తంగా ఉండాలన్నారు. పశు వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పాడి రైతులు, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

స్వామివార్ల బంగారం, వెండి ఆభరణాల తనిఖీ



ఆభరణాలు నమోదు చేస్తున్న ఏసీ, ఈఓ

పామూరు: మండల కేంద్రమైన పామూరులోని శ్రీమదన వేణుగోపాలస్వామి, వల్లీ భుజంగేశ్వర స్వామి ఆలయాలకు సంబంధించిన స్వామివార్ల బంగారు, వెండి ఆభరణాలను బుధవారం ఈఓ శ్రీగిరిరాజు నరసింహబాబు ఆధ్వర్యంలో దేవదాయ, ధర్మాదాయశాఖ జ్యుయెలరీ విభాగం ఏసీ శ్రీనివాసులు తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వామివార్లకు నాడు శ్రీకాళహస్తిరాజా వారు, భక్తులు ఇచ్చిన ఆభరణాలను పరిశీలించి రికార్డులతో పోల్చినట్లు తెలిపారు. భక్తులు ఎవరైనా ఆలయంలోని మూలవిగ్రహ, ఉత్సవ విగ్రహ దేవతామూర్తులకు ఆభరణాలు ఇవ్వదలిచినా, పూజా కైంకర్యాలకు ఉపయోగించే పూజా సామగ్రిని ఇవ్వదలచినా దుకాణాల్లో ధర్మకాటా రసీదుతో సహా ఆలయ కార్య నిర్వహణాధికారి కార్యాలయంలో అందజేసి రసీదు పొందాలన్నారు. ఆలయానికి చెందిన కొన్ని ఆభరణాలు లేవని, దీనిపై నివేదికను అధికారులకు సమర్పించనున్నట్లు తెలిపారు. రిటైర్డ్ జాయింట్ కమిషనర్ సుబ్బారావు, అర్చకులు నారాయణం సత్యబాబు, మహంకాళి శివప్రసాద్, బీజేపీ నాయకులు కేవీ రమణయ్య, ఆలయ మాజీ చైర్మన్ గుర్రం వెంకటేశ్వర్లు, బండ్ల నారాయణ, రఘురాం, నరసింహారెడ్డి పాల్గొన్నారు.

యువత ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఏఐవైఎఫ్ నాయకులు

కనిగిరి రూరల్: నిరుద్యోగ యువతి, యువకులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడంలో నిర్లక్ష్య వైఖరి అవలంభిస్తున్న ప్రభుత్వాలపై యువత ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని ఏఐవైఎఫ్ (అఖిల భారత యువజన సమాఖ్య) జిల్లా ఉపాధ్యక్షుడు పుట్టా సుబ్బారావు పిలుపునిచ్చారు. ఈ నెల 26న ఒంగోలులోని మల్లయ్య లింగం భవన్‌లో జరిగే ఏఐవైఎఫ్ జిల్లా 16వ మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ బుధవారం స్థానిక దర్శి చెంచయ్య భవన్‌లో కరపత్రాలను విడుదల చేశారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో సుబ్బారావు మాట్లాడుతూ దేశ భవిష్యత్తు నిర్మాణంలో యువత పాత్ర కీలకమన్నారు. నేటి ప్రభుత్వాలు విద్యార్థి, యువత భవిష్యత్తును విస్మరించాయని తీవ్రంగా దుయ్యబట్టారు. దేశ పురోగతిలో యువత భాగస్వామ్యం ఎంతో అవసరమన్నారు. నాడు బ్రిటీష్ పాలకులను తరిమి కొట్టడంతో యువత కీలక పాత్ర పోషించిందని వివరించారు. యువజన సమస్యలపై ఎనలేని పోరాటాలు సాగిస్తున్నట్లు తెలిపారు. 1959 మే 3న ఢిల్లీలో అఖిల భారత యుజన సమాఖ్య ఏర్పాటుకు నాంది పలికినట్లు వివరించారు. 26న జరిగే జిల్లా మహాసభలకు నిరుద్యోగ, యువతి, యువకులు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. వైఎఫ్, ఎస్ఎఫ్, ఏఐటీయూసీ నాయకులు సీహెచ్ పవన్‌కుమార్, సయ్యద్ ఇఫ్రాజ్, ఎస్‌కే ఖాశింపీరా పాల్గొన్నారు.

పరిమితికి మించి ప్రయాణికులు ఎక్కొద్దు



కూలీలకు కౌన్సిలింగ్ ఇస్తున్న ఎస్ఐ కోటయ్య

పీసీపల్లి: మండల పరిధిలోనే అలవలపాడు వద్ద పరిమితికి మించి కూలీలతో వెళ్తున్న ఆటోను ఎస్సై కోటయ్య ఆపి డ్రైవర్‌కు, కూలీలకు బుధవారం కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ మధ్య జరుగుతున్న ప్రమాదాల గురించి వివరించారు. ఇకపై మండల పరిధిలోని ఆటో డ్రైవర్లు పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించడం గానీ వెనుక వైపు డోర్లు ఓపెన్ చేసి ప్రయాణికులను కూర్చోబెట్టడం గానీ చేయరాదని, పొగాకుతో వెళ్లే ట్రాక్టర్ డ్రైవర్లు ఎట్టి పరిస్థితిలోనూ డోర్లు ఓపెన్ చేయకుండా, కూలీలు పొగాకు లోడ్‌పైన ఎక్కించకుండా ఉండేలా వారికి కౌన్సిలింగ్ చ్చారు. నియమ నిబంధనలు అతిక్రమించిన వారిపై మోటార్ వెహికల్ చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ కోటయ్య హెచ్చరించారు.